క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఉంగుటూరు(గన్నవరం): ఉంగుటూరు సెక్షన్‌లోని నందమూరు 33/11 కేవీ సబ్‌స్టేషన్ మరమ్మతుల నిమిత్తం శనివారం ఉదయం 8 నుంచి 11 గంటల వరకు పలు గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు గుడివాడ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జీబీ శ్రీనివాస్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని ఇందుపల్లి, వేమండ, నందమూరు, మానికొండ, చాగంటిపాడు, చికినాల, బొకినాల, మధిరిపాడు గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. ఆయా గ్రామాల విద్యుత్ వినియోగదారులు సహకరించవలసిందిగా ఆయన కోరారు.

నేడు పీఎం సూర్యఘర్‌పై ప్రత్యేక సింగిల్ విండో డ్రైవ్

గన్నవరం: ఉంగుటూరు మండలంలోని ఆత్కూరు జెడ్పీ హైస్కూల్‌లో ఈ నెల 10వ తేదీ ఉదయం 9 గంటల నుంచి పీఎం సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజన పథకంపై ప్రత్యేక సింగిల్ విండో డ్రైవ్ నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఈ.సత్యకుమార్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. రాయితీపై సోలార్ యూనిట్లను బ్యాంక్ రుణంపై పొందేందుకు ఒకే వేదిక ద్వారా సంబంధిత శాఖల కౌంటర్లు ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. ప్రజలకు ఉన్న సందేహాలను నివృత్తి చేసి ఈ పథకం ప్రయోజనాలు పొందే విధంగా అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

మృతుని కుటుంబానికి వైఎస్సార్ సీపీ ఆర్థిక సాయం



పెనమలూరు: గంగూరులో వైఎస్సార్ సీపీ నాయకుడు షేక్ అమీన్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన నేపథ్యంలో ఆయన కుటుంబానికి పెనమలూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త దేవభక్తుని చక్రవర్తి ఆర్థిక సాయం అందించారు. గ్రామంలో శుక్రవారం బాధితుడి కుటుంబ సభ్యులను వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కొత్తపల్లి వెంకటేశ్వరరావు, మాజీ సర్పంచి దేవమణి, గ్రామ వైఎస్సార్ సీపీ నేతలు గని, రహీం, పి.రాజేష్ తదితరులు కలసి చక్రవర్తి పంపిన రూ.10 వేలను అమీన్ కుటుంబ సభ్యులకు అందజేశారు.

వ్యక్తిగత పరిశుభ్రతపై శ్రద్ధ వహించాలి

గన్నవరం: మండలంలోని కేసరపల్లి శివారు స్నేహపురి కాలనీలో శుక్రవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో కిశోర వికాసంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సీహెచ్ నాగపద్మావతి మాట్లాడుతూ బాలికల సర్వతోముఖాభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని కిశోర వికాసంలో భాగంగా అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. ముఖ్యంగా బాలికలు విద్య, ఆరోగ్యం, ఆహారం, వ్యక్తిగత శుభ్రత పట్ల శ్రద్ధ వహించాలని చెప్పారు. బాల్య వివాహాల నియంత్రణలో అందరూ భాగస్వాములు కావాలని కోరారు. బాలికలకు ఎటువంటి సమస్యలు ఎదురైనా తల్లిదండ్రులు, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లాలని సూచించారు. చైల్డ్‌లైన్ ప్రతినిధి ప్రేమ, పలువురు అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

గుండెపోటుతో ఉపాధి కూలీ మృతి

ఉయ్యూరురూరల్: మహాత్మ గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి పథకం కూలీగా పని చేస్తున్న వ్యక్తి గుండెపోటుతో మృతి చెందిన దుర్ఘటన ఉయ్యూరు మండలం బోళ్లపాడులో శుక్రవారం చోటుచేసుకుంది. సేకరించిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బాణావాట్ వాలి నాయక్ (62) రోజువారీ పనిలో భాగంగా ఉపాధి హామీ పథకంలో కూలీగా పనిచేస్తున్నారు. ఈ క్రమంలో ఉదయం యథావిధిగా పంట బోదె తవ్వుతున్న క్రమంలో ఒక్కసారిగా గుండెపోటుతో కుప్పకూలాడు. సహచర కూలీలు, అధికారులకు సమాచారం ఇచ్చి ఉయ్యూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మార్గంమధ్యలోనే వాలినాయక్ మృతి చెందినట్లు వైద్యులు గుర్తించారు. సమాచారం తెలుసుకున్న ఉయ్యూరు ఎంపీడీవో జీబీఎస్ శేషగిరిరావు ఘటనా స్థలానికి చేరుకుని వాలినాయక్ భౌతికకాయాన్ని సందర్శించారు. ఇంటి యజమానిని కోల్పోయిన పేద కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని వాలినాయక్ కుటుంబసభ్యులు కోరుతున్నారు.

నేడు 'ప్రాసెస్ టు ప్రోస్పర్' శిక్షణ కార్యక్రమం

రామవరప్పాడు : చిన్న, అతి చిన్న పరిశ్రమల అభివృద్ధికి తోడ్పడే ప్రథమ స్థాయి సేవా సంస్థ ఎంఎస్ఎంఈసీసీ (మాన్యుఫ్యాక్చరర్స్ సర్వీసెస్ మార్కెటింగ్ ఎంట్రప్రెన్యూర్స్ చాంబర్ ఆఫ్ కామర్స్) ఆధ్వర్యంలో శనివారం సీతారామపురంలోని ఐకాన్ పబ్లిక్ స్కూల్ సమీపంలో ప్రాసెస్ టు ప్రోస్పర్ అను ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంఎస్ఎంఈ చాంబర్ ఆఫ్ కామర్స్ చైర్మన్ డాక్టర్ దాసరి దేవరాజ్ తెలిపారు. ఈ కార్యక్రమం ఫుడ్ ప్రాసెసింగ్ రంగం, ఎంఎస్ఎంఈ పరిశ్రమలు, స్టార్టప్ దశల వ్యాపారాల్లో ఆసక్తి ఉన్న యువత కోసం రూపొందించినట్లు తెలిపారు.

నిత్యం ట్రాఫిక్‌తో సతమతం

- ఉదయం, సాయంత్రం సమయాల్లో సమస్య తీవ్రం
- జాతీయ రహదారిపై బారులు తీరుతున్న వాహనాలు
- పూర్తి స్థాయిలో కనిపించని ట్రాఫిక్ పోలీసులు
- డేంజర్ జోన్లలో పెరుగుతున్న ప్రమాదాలు



జాతీయ రహదారిపై బారులు తీరిన వాహనాలు

రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న పలు గ్రామాల ప్రజలను నిత్యం ట్రాఫిక్ సమస్యలు పట్టి పీడిస్తున్నాయి. రామవరప్పాడు, ప్రసాదంపాడు, ఎనికేపాడు, నిడమానూరు, గూడవల్లి తదితర గ్రామాలు జాతీయ రహదారిని ఆనుకుని ఉన్నాయి. దీంతో ఏ చిన్నపాటి అవసరం వచ్చిన ఆయా గ్రామాల వారు జాతీయ రహదారి పైకి రావాల్సిందే. నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగించే ఈ రహదారిపై నిత్యం ట్రాఫిక్ స్తంభిస్తోంది. హనుమాన్‌జంక్షన్ నుంచి రామవరప్పాడు రింగ్ వరకూ సుమారు 37 కిలోమీటర్లు పొడవు ఉంది. గన్నవరం, ఉంగుటూరు, విజయవాడ రూరల్ మండలాల మీదుగా నిత్యం జాతీయ రహదారిపై వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. పలు సందర్భాల్లో గంటల కొద్దీ వాహనాలు నిలిచిపోతుంటాయి. జాతీయ రహదారిని ఆనుకుని పలు కళాశాలలు, కార్పొరేట్ పాఠశాలలు ఉన్నాయి. దీంతో ఉదయం, సాయంత్రం రహదారిపై తీవ్ర రద్దీ ఉంటుంది. నిత్యం ట్రాఫిక్ చక్రబంధంలో ఇరుక్కుని నిర్ణీత సమయానికి గమ్యస్థానం చేరుకోలేకపోతున్నామని ప్రయాణికులు, విద్యార్థులు పలు గ్రామాల ప్రజలు వాపోతున్నారు. ట్రాఫిక్‌ను నియంత్రించేందుకు ప్రధాన కూడళ్లలో ట్రాఫిక్ పోలీసులు కొరవడటంతో విద్యార్థులు, వృద్ధులు, మహిళలు రహదారి పైకి రావాలంటేనే భయపడుతున్నారు.

నిత్యం ప్రత్యక్ష నరకమే

పలు గ్రామాల్లో ప్రధాన కూడళ్లలో నిత్యం ట్రాఫిక్ స్తంభిస్తోంది. రామవరప్పాడు రింగ్, పేరంటాలమ్మ ఆలయం సెంటర్, వంతెన సెంటర్, ప్రసాదంపాడు ప్రధాన సెంటర్, ఎనికేపాడు ఎస్సార్కే కళాశాల, 100 అడుగుల రోడ్డు మలుపు వద్ద, నిడమానూరు భారతీ వాల్ మార్ట్, చైతన్య కళాశాల, గూడవల్లి సెంటర్ తదితర కూడళ్లలో నిత్యం వాహనాలు బారులు తీరుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారని పలు గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. డేంజర్ జోన్‌లుగా పిలిచే ఈ ప్రాంతాల్లో రోడ్డు ప్రమాదాలు నిత్యకృత్యమయ్యాయి. ఈ గ్రామాల్లో గడిచిన మూడు నెలల్లో పదుల సంఖ్యలో మృత్యువాత పడ్డారు. పలువురు క్షతగాత్రులయ్యారు.

ట్రాఫిక్‌లో బెంజిసర్కిల్‌కు పోటీగా రామవరప్పాడు రింగ్

నగరంలోని బెంజిసర్కిల్ వద్ద నిత్యం ట్రాఫిక్ ఏ రేంజ్‌లో నిలుస్తుందో ప్రత్యేకంగా చెప్పనక్కరలేదు. రూరల్ పరిధిలో ఉన్న రామవరప్పాడు రింగ్ ట్రాఫిక్‌లో మరో బెంజిసర్కిల్‌గా మారింది. హనుమాన్‌జంక్షన్ నుంచి వచ్చే భారీ వాహనాలు, ఇతర వాహనాలు జాతీయ రహదారి మీదుగా రామవరప్పాడు రింగ్‌కు చేరుకుంటాయి. పలు వాహనాలు రింగ్ వద్ద యూటర్న్ తీసుకుంటూ ఇన్నర్ రింగ్ రోడ్డు మీదుగా వెళుతున్నాయి. ఈ సమయంలో రామవరప్పాడు సర్కిల్‌లో భారీగా ట్రాఫిక్ నిలిచిపోతోంది.

ప్రత్యామ్నాయ రహదారి అంశం ఏమైంది?

రామవరప్పాడు రింగ్ సర్వీస్ రోడ్డు సమీపంలో హైటెన్షన్ వైర్ల కింద నుంచి వెళ్లే ప్రత్యామ్నాయ రహదారి నిర్మాణ అంశాన్ని కొన్నేళ్ల క్రితం తెర పైకి తీసుకొచ్చారు. ఈ రోడ్డు నిర్మాణం జరిగితే భవిష్యత్‌లో భారీ వాహనాలకు అతి సులువైన మార్గం అవుతుందని అప్పట్లో హడావుడి చేశారు. కాని ఇప్పటివరకూ ఈ రహదారి గురించి పట్టించుకున్న పాపాన పోలేదు. కరెన్సీనగర్ సమీపంలో హైటెన్షన్ వైర్ల కింద 80 అడుగుల రహదారి ఉంది. ఈ రహదారి సరాసరి నిడమానూరు జాతీయ రహదారికి కలుస్తుంది. ఈ రహదారిలో ఉన్న కొద్దిపాటి ఆక్రమణలు తొలగించి అభివృద్ధి పరచినట్లయితే నిడమానూరు నుంచి రామవరప్పాడు వరకూ జాతీయ రహదారి పైకి వాహనాలు ఎక్కాల్సిన అవసరం ఉండదు. గన్నవరం ఎయిర్‌పోర్టు నుంచి వచ్చే ఎమ్మెల్యేలు, మంత్రుల కాన్వాయ్‌లు కూడా ఈ ప్రత్యామ్నాయ మార్గంలో ఎవరికీ ఇబ్బంది లేకుండా వెళ్లవచ్చు. దీంతో చాలా వరకూ ట్రాఫిక్ సమస్యలకు చెక్ పెట్టవచ్చు. ప్రత్యామ్నాయ రహదారి అంశాన్ని పరిగణనలోకి తీసుకోవాలని ప్రయాణికులు, పలు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

నిత్యం వాహనాలు బారులు తీరాల్సిందే

జాతీయ రహదారిపై వాహనాల రద్దీ ఎక్కువవడంతో ముఖ్యంగా ఉదయం, సాయంత్రం సమయాల్లో వాహనాలు బారులు తీరుతున్నాయి. ప్రధాన కూడళ్లలో ట్రాఫిక్ పోలీసులను పూర్తి స్థాయిలో నియమిస్తే కొంత వరకు ట్రాఫిక్ సమస్యను పరిష్కరించవచ్చు. సీఎం, మంత్రుల కాన్వాయ్ వచ్చినప్పుడు మాత్రం ట్రాఫిక్ పోలీసులు హడావుడి చేస్తారు. మిగిలిన సమయాల్లో కనిపించరు.

– సీహెచ్ వెంకట రాజా, ప్రయాణికుడు

11 నుంచి చినకంచిలో బ్రహ్మోత్సవాలు

నున్న(విజయవాడరూరల్): ఆధ్యాత్మిక కేంద్రంగా విరాజిల్లుతున్న నున్న గ్రామంలోని చినకంచి శ్రీచంద్రశేఖరేంద్ర సరస్వతీ స్వామి వారి దేవస్థానంలో ఈ నెల 11 నుంచి 13వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నట్లు దేవస్థానం ట్రస్టీ మొక్కపాటి శర్మ శుక్రవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. 11వ తేదీ ఆదివారం స్వాతి నక్షత్రంతో కూడిన చతుర్దశి కావటంతో నరసింహస్వామి వారి జన్మదినం రోజున చినకంచిలోని నరసింహస్వామి వారికి 108 కలశాల పానకాన్ని 108 సార్లు పురుష సూక్తాన్ని పాటిస్తూ అభిషేకం చేస్తారు. తదుపరి అలంకరణ చేసి పూజా కార్యక్రమాలను నిర్వహిస్తారు. అనంతరం గణపతి పూజ, పుణ్యాహవచనం కలశ స్థాపన అఖండ దీపారాధన పంచగవ్యప్రాసన మొదలగు కార్యక్రమాలను నిర్వహించి బ్రహ్మోత్సవాలను ప్రారంభిస్తారు. పిమ్మట లక్ష్మీనరసింహస్వామి వారికి కల్యాణం నిర్వహిస్తారు. హోమాలు, త్రికాలార్చనలు జరుపుతారు. బ్రహ్మోత్సవాల రెండవ రోజున వైశాఖ పూర్ణిమ రోజు శ్రీ వెంకటేశ్వరస్వామి వారికి లక్ష మల్లెపూలతో అర్చన నిర్వహిస్తారు. అనంతరం శ్రీ వెంకటేశ్వరస్వామి వారి కల్యాణం చేసిన పిమ్మట సాయంత్రం శ్రీచంద్రశేఖరేంద్ర సరస్వతి స్వామి వారిని నందివాహనం మీద అలంకరింపచేసి ఊరేగిస్తారు. త్రికాల అర్చనలు మంటప పూజలు నిర్వహిస్తారు. మూడవ రోజు బహుళ పాడ్యమి నాడు శ్రీచంద్రశేఖరేంద్ర సరస్వతి స్వామి 132వ జయంతి రోజున స్వామి వారికి ప్రత్యేక అభిషేక అర్చనలు నిర్వహించి, పరిషత్ పారాయణ జరుపుతారు. అనంతరం పోపూరి గౌరీనాథ్ ఆధ్వర్యంలో నాదనీరాజనం, శివ కల్యాణం నిర్వహిస్తారు. వేదసభ అనంతరం భక్తులందరికీ అన్నదానం జరుగుతుంది.

ఉరి వేసుకుని వడ్రంగి ఆత్మహత్య



మృతి చెందిన త్రివిక్రమాచార్యులు

పెనమలూరు: కుటుంబ తగాదాలతో మనస్తాపం చెందిన వడ్రంగి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన వణుకూరు గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. పెనమలూరు సీఐ వెంకటరమణ తెలిపిన వివరాల ప్రకారం .. గ్రామానికి చెందిన పామర్తి త్రివిక్రమాచార్యులు (37) విజయశాంతి దంపతులకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. త్రివిక్రమాచార్యులు వడ్రంగి పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. అతనికి, అతని భార్యకు తరచుగా గొడవలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో గురువారం భార్యతో గొడవపడ్డాడు. భార్య పుట్టిల్లు అయిన పామర్రు వెళ్లి రాత్రి ఇంటికి తిరిగి రాలేదు. ఈ నేపథ్యంలో శుక్రవారం త్రివిక్రమాచార్యులు ఇంట్లో ఉదయం నుంచి తలుపులు తెరవకపోవడంతో అనుమానం వచ్చి స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు వచ్చి బలవంతంగా ఇంటి తలుపులు తెరిచి చూడగా అతను లోపల గదిలో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరి వేసుకుని మృతి చెంది ఉన్నాడు. భార్యభర్తల తగాదాతోనే మనస్తాపంతో ఆత్మహత్య చేసుకుని ఉంటాడని పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేశారు.

విద్యుత్ చౌర్యానికి పాల్పడితే చర్యలు

హనుమాన్‌జంక్షన్‌రూరల్: నిబంధనలకు విరుద్ధంగా విద్యుత్ చౌర్యానికి పాల్పడితే చర్యలు తప్పవని ఏపీసీపీడీసీఎల్ గుడివాడ డివిజన్ ఈఈ జీబీ శ్రీనివాసరావు, విజిలెన్స్ ఈఈ సీహెచ్ వాసు హెచ్చరించారు. బాపులపాడు మండలంలోని వీరవల్లి సెక్షన్ పరిధిలో విద్యుత్, విజిలెన్స్ అధికారులు శుక్రవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. గుడివాడ డివిజన్ ఈఈ జీబీ శ్రీనివాసరావు, విజిలెన్స్ ఈఈ సీహెచ్ వాసు నేతృత్వంలో అధికారులు 41 బృందాలుగా ఏర్పడి 2585 గృహ, వాణిజ్య విద్యుత్ సర్వీసులను తనిఖీ చేశారు. వీటిలో 286 విద్యుత్ సర్వీసులు అదనపు లోడు వినియోగిస్తున్నట్లుగా గుర్తించామని, సంబంధిత యజమానులకు లోడు క్రమబద్ధీకరణకు నోటీసులు జారీ చేశామని తెలిపారు. విద్యుత్ చౌర్యం చట్టరీత్యా నేరమని, విద్యుత్ చౌర్యానికి పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎక్కడైనా విద్యుత్ చౌర్యం జరిగినట్లు తెలిస్తే సమాచారం అందించాలని కోరారు. ఈ తనిఖీల్లో ఏపీసీపీడీసీఎల్ హనుమాన్ జంక్షన్ సబ్ డివిజన్ డీఈఈ బి.శ్రీనివాసరావు, వీరవల్లి ఏఈ యు.మురళీకృష్ణారావు, పలువురు ఏఈలు, లైన్ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

సచివాలయాల్లో నీటి తీరువా చెల్లింపులు

విజయవాడరూరల్: రైతులు నీటి తీరువా బకాయిలను గ్రామాల్లోని సచివాలయాల్లో డిజిటల్ అసిస్టెంట్ల ద్వారా ఆన్‌లైన్‌లో చెల్లించుకునే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించిందని విజయవాడ రూరల్ మండల తహసీల్దార్ బి.సుగుణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. వ్యవసాయ పంటపొలాలను సాగు చేసుకునేందుకు రైతులు వినియోగించుకునే నీటికి గాను నీటితీరువా చెల్లించాల్సి ఉంటుందన్నారు. మైనర్ ఇరిగేషన్ అనగా చెరువు, లిఫ్ట్ ఇరిగేషన్, చెక్‌డ్యామ్‌ల ద్వారా లభించే నీటిని వినియోగించుకునే రైతులు ఎకరానికి వంద రూపాయల చొప్పున, మేజర్ ఇరిగేషన్ పరిధిలోకి వచ్చే బందరు కాల్వ, ఏలూరు కాల్వ, రైవస్ కాల్వ ద్వారా నీటిని వినియోగించుకునే రైతులు ఎకరానికి 200 రూపాయల చొప్పున నీటి తీరువా చెల్లించాల్సి ఉందన్నారు. గ్రామ సచివాలయాల్లో డిజిటల్ అసిస్టెంట్ల వద్ద రైతులు తమ ఆధార్‌కార్డు, భూమి ఖాతా నంబర్లను ఆన్‌లైన్లో చూపించుకుని నీటితీరువా బకాయిలను చెల్లించాలని తెలియజేశారు. గతంలో గ్రామాల్లో వీఆర్వోల ద్వారా నీటి తీరువా వసూలు చేసేవారని, రైతుల సౌకర్యార్థం ఈ సదుపాయం ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ తెలియజేశారు.

12న ఇంద్రకీలాద్రి గిరి ప్రదక్షిణ

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): పౌర్ణమిని పురస్కరించుకుని ఈ నెల 12వ తేదీ సోమవారం ఇంద్రకీలాద్రి గిరిప్రదక్షిణ నిర్వహిస్తారని దుర్గగుడి అధికారులు పేర్కొన్నారు. సోమవారం తెల్లవారుజామున 5.55 గంటలకు దుర్గగుడి ఘాట్‌రోడ్డులోని కామధేను అమ్మవారి ఆలయం నుంచి గిరిప్రదక్షిణ ప్రారంభమవుతుంది. ఘాట్‌రోడ్డు నుంచి ప్రారంభమయ్యే గిరి ప్రదక్షిణ కుమ్మరిపాలెం, విద్యాధరపురం, నాలుగు స్తంభాలు, సితార జంక్షన్, కబేళా, పాలప్రాజెక్టు, చిట్టినగర్, కేటీ రోడ్డు, నెహ్రూబొమ్మ సెంటర్, బ్రాహ్మణ వీధి, రథం సెంటర్ మీదుగా తిరిగి ఆలయానికి చేరుకుంటుంది.

నేడు పీఎం సూర్యఘర్‌పై సమావేశం

కంకిపాడు: పీఎం సూర్యఘర్‌పై శనివారం కాసరనేనివారిపాలెంలో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించనున్నట్లు విద్యుత్‌శాఖ ఏఈ టి.అశోక్‌కుమార్ తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు గ్రామంలో ప్రత్యేక డ్రైవ్ జరుగుతుందన్నారు. పీఎం సూర్యఘర్ ప్రయోజనాలపై గ్రామస్తులకు అవగాహన కల్పిస్తామన్నారు. కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ హాజరవుతారని, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

బ్యాంకులకు సమ్మె నోటీసు

పెనమలూరు: ఈ నెల 20వ తేదీన దేశవ్యాప్తంగా చేపట్టిన సమ్మె పిలుపులో భాగంగా శుక్రవారం మండల పరిధిలో పలు బ్యాంకులకు సీఐటీయూ నేతలు సమ్మె నోటీసులు అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి ఉప్పాడ త్రిమూర్తి మాట్లాడుతూ సమ్మెకు అందరి మద్దతు కావాలని కోరారు. ఈ సందర్భంగా పోరంకి యూనియన్ బ్యాంకు, స్టేట్ బ్యాంక్, కరూర్ వైశ్యా బ్యాంక్, ఏపీ గ్రామీణ బ్యాంకు, తాడిగడప యూనియన్ బ్యాంకులకు సమ్మె నోటీసులు ఇచ్చారు.

ఇంటి ఎదుట నిలిపిన బైక్ చోరీ

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఇంటి ముందు నిలిపిన బైక్ మాయమైన ఘటన భవానీపురం పీఎస్ పరిధిలో జరిగింది. భవానీపురం ఆర్టీసీ వర్క్‌షాపు రోడ్డుకు చెందిన సయ్యద్ ఫర్హీన్ మహేంద్ర ఫైనాన్స్‌లో రికవరీ ఏజెంట్. తన అవసరాల నిమిత్తం ద్విచక్ర వాహనం కొనుగోలు చేశాడు. గత నెల 29వ తేదీ రాత్రి ఇంటి ముందు బైక్ పార్కింగ్ చేశాడు. మరుసటి రోజు 30వ తేదీ ఉదయం 7 గంటల ప్రాంతంలో చూడగా బైక్ కనిపించలేదు. చుట్టు పక్కల వెదికినా ఆచూకీ లభించకపోవడంతో భవానీపురం పీఎస్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు.

దుర్గమ్మ చెంత సంగీత కచేరీ



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో శుక్రవారం సంగీత కచేరీ జరిగింది. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని కళావేదికపై విజయనగరానికి చెందిన సప్త స్వరాలయ సంగీత కళాశాలకు చెందిన తమ్మిన రవికుమార్ ఆధ్వర్యంలో పలువురు విద్యార్థులు పలు భక్తి కీర్తనలను ఆలపించారు. అనంతరం కళాబృందానికి అమ్మవారి దర్శనం కల్పించి ప్రసాదాలను అందజేశారు.

రోడ్డు ప్రమాదంలో మహిళకు గాయాలు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): బైక్‌ను కారు వెనుకనుంచి ఢీ కొట్టిన ఘటనలో మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. భవానీపురం ప్రియదర్శిని కాలనీకి చెందిన దొంతిరెడ్డి రమణమ్మ గొల్లపూడి పోస్టాఫీసు రోడ్డులో పాలు పట్టేందుకు వెళ్లింది. శుక్రవారం ఉదయం 7గంటల సమయంలో ఆమె అల్లుడు సానికొమ్ము రమణారెడ్డి తన బైక్‌పై ఎక్కించుకొని ఇంటికి తీసుకెళ్తున్నాడు. ఆ సమయంలో గొల్లపూడి హరిజనవాడ సమీపంలోకి రాగానే వెనుక నుంచి వేగంగా వచ్చిన కారు బైక్‌ను ఢీకొట్టింది. వారిద్దరూ కింద పడిపోయారు. ఘటనలో రమణారెడ్డికి చేతికి స్వల్పగాయం కాగా రమణమ్మ తలకు ఎడమవైపు బలమైన గాయమైంది. ఆమెను అక్కడికి సమీపంలోని ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. దీనిపై భవానీపురం పోలీసులు కేసు నమోదు చేశారు.

నకిలీ సర్జికల్ వస్తువుల విక్రేతలపై కేసులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): నకిలీ సర్జికల్ వస్తువులను విక్రయిస్తున్న విక్రేతలపై వన్‌టౌన్ పోలీసులు శుక్రవారం రాత్రి కేసులు నమోదు చేశారు. వివరాల్లోకి వెళితే లైఫ్ స్కాన్ ఐపీ కంపెనీకి చెందిన వన్‌టచ్ బ్లడ్ గ్లూజ్ టెస్ట్ స్ట్రిప్స్ వస్తువులను నకిలీవి వన్‌టౌన్ మెడికల్ మార్కెట్‌లోని సర్జికల్ దుకాణాల్లో విక్రయిస్తున్నారని ఆ కంపెనీకి సమాచారమందింది. దాంతో ఆ సంస్థ ప్రతినిధులు వన్‌టౌన్ పోలీసులకు సమాచారమందించి ఆ దుకాణాలపై దాడి చేశారు.

మిస్టరీగా మారిన గణేష్ అదృశ్యం కేసు

- బందరు కాలువలో గాలించిన ఏపీఎస్‌డీఆర్‌ఎఫ్
- 15 రోజులైనా పోలీసులకు లభించని ఆచూకీ



పెనమలూరు: పోరంకిలో వ్యక్తి అదృశ్యం మిస్టరీగా మారింది. 15 రోజుల క్రితం ఇంటి వద్ద నుంచి అదృశ్యమైన వ్యక్తి ఆచూకీ నేటికీ తెలియలేదు. అతను పెనమలూరు వంతెన వద్ద బందరు కాలువలో దూకి ఉంటాడన్న అనుమానంతో శుక్రవారం పోలీసులు, ఏపీ ఎస్డీఆర్‌ఎఫ్ బృందాలు గాలించినా అతని జాడ తెలియలేదు. ఘటన వివరాల్లోకి వెళితే తాడిగడప మున్సిపాలిటీ పరిధిలోని పెనమలూరు సెంటర్ సాలిపేటలో సింహాద్రి దుర్గారావు కుటుంబ సభ్యులతో సాయిలక్ష్మి అపార్టుమెంట్‌లో నివసిస్తున్నాడు. అతను లారీ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. అతని కుమారుడు సింహాద్రి గణేష్ (37) ఎనికేపాడులోని ఒక కాలేజీలో గుమస్తాగా పనిచేస్తున్నాడు. అతనికి ఏడాది క్రితం వివాహం జరిగింది. గత నెల 26వ తేదీన ఎప్పటిలాగే కాలేజీకి వెళ్లాడు. అయితే రాత్రి ఇంటికి తిరిగి రాలేదు. అతని బైక్‌ను మాత్రం అపార్టుమెంట్‌లో రాత్రి 11 గంటల తరువాత అదే రోజు పార్కు చేశాడు. గణేష్ ఫోన్‌కు కాల్ చేస్తే స్విచ్చాఫ్ వచ్చింది. దీంతో గణేష్ తల్లి వెంకటేశ్వరమ్మ పోలీసులకు ఫిర్యాదు చేస్తూ గణేష్ క్రికెట్ బెట్టింగ్‌లకు అలవాటు పడి సొమ్ము పోగొట్టున్నాడని పేర్కొంది. ఆర్థిక ఇబ్బందుల కారణంగానే గణేష్ అదృశ్యమై ఉంటాడని పోలీసులు మిస్సింగ్ కేసుగా నమోదు చేసి విచారణ చేపట్టారు. అతని ఫోన్ ట్రాక్ చేయటానికి యత్నించగా అది పని చేయటం లేదు. గణేష్ గత నెల 26వ తేదీన పెనమలూరు వంతెనపై తచ్చాడుతున్నట్లు సీసీ కెమెరాలో పోలీసులు గుర్తించారు. వంతెనపై నుంచి బందరు కాలువలో దూకి ఉంటాడని అనుమానంతో ఏపీ ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందం గాలింపు చేపట్టింది. ఎంత గాలించినా గణేష్ ఆచూకీ లభించలేదు. పైగా బందరు కాలువలో మోకాలిలోతు నీరు మాత్రమే ఉండటంతో అసలు గణేష్ కాలువలో దూకాడో లేదో తెలియటం లేదు. ఈ కేసు ముందుకు సాగక పోవటంతో పోలీసులు తల పట్టుకుంటున్నారు. గణేష్ అదృశ్యానికి ఆర్థిక కారణాలా లేక మరేదైనా కారణం ఉందా అనే కోణంలో పోలీసులు విచారణ చేస్తున్నారు. పెళ్లి చేసుకున్న ఏడాదికే గణేష్ అదృశ్యం కావటంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు.

బాల్య వివాహాల నిరోధానికి సహకరించండి

ఉయ్యూరురూరల్: బాల్య వివాహాల నిరోధానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని బోళ్లపాడు ఏఎన్ఎం రోహిణి కోరారు. స్థానిక వెల్‌నెస్ సెంటర్లో శుక్రవారం కిశోరి వికాసం వేసవి సెలవుల కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా బాలబాలికలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సంపూర్ణ ఆరోగ్యం, నాణ్యమైన విద్య, వ్యక్తిగత రుతు సేవ పరిశుభ్రత పట్ల అవగాహన పెంచుకోవాలన్నారు. బాల్య వివాహలను అరికట్టడంలో, లైంగిక వేధింపుల నివారణలో, మానవ అక్రమ రవాణాను నివారించడంలో ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. యుక్త వయస్సు విద్యార్థుల్లో ఆత్మరక్షణ, నైపుణ్య ఉపాధి పెంపొందించేలా అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు ఇందిర, జయచింత పాల్గొన్నారు.

కాటూరులో..

మండలంలోని కాటూరు ఒకటి, రెండు సచివాలయాల్లో కిశోరి వికాస కార్యక్రమంలో పలువురు పంచాయతీ అధికారులు, ఆరోగ్యశాఖ సిబ్బంది, అంగన్వాడి కార్యకర్తలు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు నిరోధించాలి

పెనమలూరు: బాల్య వివాహాలు నివారించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కె.శ్రీలత అన్నారు. మండల పరిధిలో గోసాల, వణుకూరు, గంగూరు గ్రామ సచివాలయాల పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాలలో కిశోరి వికాసం వేసవి శిబిరంలో భాగంగా కిశోర బాలికలకు అవగాహన సదస్సులు నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ శ్రీలత మాట్లాడుతూ బాల్య వివాహాల వలన అనేక అనర్థాలు జరుగుతాయన్నారు. 18 సంవత్సరాల లోపు వివాహాలు జరిగితే అనేక ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని వివరించారు. మైనర్లకు వివాహం చేస్తే చట్టపరమైన చర్యలు కూడా ఉంటాయని అన్నారు. ఏఎన్ఎం సురేఖ మాట్లాడుతూ కిశోర బాలికలు ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపాలని, పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మహిళా కార్యదర్శులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, కిశోర బాలికలు, తల్లులు పాల్గొన్నారు.

మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి

ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ



మహిళా పారిశ్రామికవేత్తలతో మాట్లాడుతున్న కలెక్టర్ లక్ష్మీశ

గన్నవరంరూరల్: మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ ఆకాంక్షించారు. గన్నవరం మండలం సూరంపల్లి మహిళా పారిశ్రామికవాడలో శుక్రవారం ఎన్టీఆర్ జిల్లా డీఆర్‌డీఏ, మెప్మా ఆధ్వర్యంలో గ్రామీణ, పట్టణ ప్రాంతాల స్వయం సహాయక సంఘాలకు చెందిన 70 మంది మహిళలకు అసోసియేషన్ ఆఫ్ లేడీ ఎంటర్ ప్రెన్యూర్స్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జరిగిన శిక్షణ కార్యక్రమాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఇప్పటికే యూనిట్లు ప్రారంభించి నడుపుతున్న పారిశ్రామికవేత్తలతో ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు దిశానిర్దేశం చేశారు. వనరుల సమీకరణ, బ్యాంక్ రుణాలు, మార్కెటింగ్, నైపుణ్య శిక్షణ, యూనిట్ నిర్వహణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రతినిధులు శిక్షణ ఇచ్చారు. కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదిగి అందరికీ ఆదర్శంగా రాణించాలన్నారు. దృఢ సంకల్పం, ఆలోచనకు ఆశయం తోడైతే విజయం సొంతం అవుతుందని చెప్పారు. డీఆర్‌డీఏ పీడీ నాంచారరావు, కె.కనకదుర్గ తదితరులు పాల్గొన్నారు.

క్షేత్రస్థాయిలో సమస్యలు తెలుసుకునేందుకే...

గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు

హనుమాన్‌జంక్షన్ రూరల్: క్షేత్రస్థాయిలో ప్రజల సమస్యలు తెలుసుకుని, సత్వరంగా పరిష్కరించేందుకే ప్రత్యేక గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. స్థానిక నూజివీడురోడ్డులోని జెడ్పీ హైస్కూల్ ప్రాంగణంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక ప్రత్యేక గ్రామ సభను శుక్రవారం రాత్రి ఆయన నిర్వహించారు. మండలంలోని పలు గ్రామాల ప్రజల నుంచి ఆయన అర్జీలు స్వీకరించారు. పలు సామాజిక, వ్యక్తిగత సమస్యలను ఎమ్మెల్యే యార్లగడ్డకు విన్నవించగా, నిర్దిష్ట గడువులోగా వాటిని పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆయన ఆదేశించారు. ఎన్‌హెచ్ 216 హెచ్ నుంచి రంగయ్య అప్పారావు పేట రహదారి నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయని, కాంట్రాక్టర్ బాధ్యతారహితంగా వ్యవహరిస్తున్నారని ఆ గ్రామస్తులు ఎమ్మెల్యే వద్ద వాపోయారు. గ్రామంలో పంచాయతీ కార్యాలయం, ఆరోగ్య ఉప కేంద్రం భవనాలను నిర్మించాలని కోరారు. గుడివాడ ఆర్డీవో బాలసుబ్రహ్మణ్యం, గన్నవరం డీఎస్పీ చలసాని శ్రీనివాసరావు, తహసీల్దార్ బండ్రెడ్డి రామ కృష్ణ, ఉప సర్పంచ్ దుట్టా శివన్నారాయణ పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలపై సమ్మెను జయప్రదం చేయాలి

గన్నవరం: కేంద్ర ప్రభుత్వం నూతనంగా తీసుకువచ్చిన లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా ఈ నెల 20న చేపట్టిన సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా నాయకుడు కళ్లం వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో శుక్రవారం సమ్మె సన్నాహాల్లో భాగంగా ప్రజా సంఘాల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కళ్లం మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల వల్ల కార్మికులకు తీరని అన్యాయం జరుగుతుందన్నారు. సమ్మెలో అన్ని కార్మిక, ప్రజా సంఘాలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ప్రజా సంఘాల నేతలు సూరగాని సాంబశివరావు, రాంబాబు, లలితకుమారి, రమణ, మరియదాసు పాల్గొన్నారు.